

కథ

# ఆపరేషన్ రాక్‌స్టార్

విరూరు రుక్మిణి

శాంతమ్మగారి ఆపరేషన్ డేట్ ఫిక్సయింది. అదెంత సెన్సేషనల్ న్యూసో ఆ ఇంట్లో. మొదటిసారి నొప్పొచ్చినప్పుడు ఆపరేషన్ చేయించుకోవాలమ్మా అని డాక్టరంటే "అబ్బే...ఇప్పుడు లాభంలేదు, మా డాక్టరు శశాంక్ అదేదో దేశం వెళ్లాడు వాడు రావాలి. పైగా ప్రాణాపాయం లేదంటున్నారు గదా మరేం ఫరవాలేదు" అంటూ దాటేసింది. రెండోసారేమో "మా మనవడికి 12వ క్లాసు పరీక్షలు. వెంటనే ఐఐటీ, బిట్స్ పిలానీ, ఇంకెన్నో ఎంట్రన్సులు ఇంట్లో బోలెడు హడావిడి. ఈసారి నెప్పొస్తే చూద్దాం" అంటూ మనసులోని భయం బయటపడనీకుండా తప్పించేసింది.

ముచ్చటగా మూడోసారి మరింత ఉధృతంగా నొప్పి రావడం "ఈ నొప్పి మందులతో తగ్గదాంటీ మీకెందుకు భయం నేనున్నాగా" అని డాక్టర్ శశాంక్ అనటంతో, "సరేరా శశీ శని ఉషస్సు అన్నింటికీ శుభప్రదం. శనివారం తెల్లవారుఝాము ముహూర్తం ఫిక్స్ చేసేయండి" అని ఆర్డరు జారీచేసేసింది.

ఆరోజు అనస్థీషియా డాక్టరు ఫ్రీగా వుంటాడో లేదో అన్న శశాంక్ మాటను మధ్యలోనే తుంచేస్తూ, "చూడు శశీ, నిన్ను చిన్నప్పటినుంచీ పెంచి పెద్దచేశాను. నా సంగతి నీకు తెలుసు మాటంటే మాటే. మత్తు మందియ్యడానికి ఏ డాక్టరయితేనేం, ఆపరేషను చేసేది నీవే కదా, శనివారం పొద్దున.. మరేం మాట్లాడకు"

"సరే ఆంటీ, ఒక్కరోజు ముందొచ్చి జాయినయితే చాలు. ఏమేం కావాలో ఆ లిస్టంతా మా నర్సు ఇస్తుంది. మందులవీ ఏం కావాలో నేను చూసుకుంటాను. మీరు, అంకుల్ ఏం దిగులు పెట్టుకోకండి. తరువాత రెండు రోజులు అబ్జర్వేషన్ కోసం హాస్పిటల్‌లో వుంటే సరిపోతుంది. అన్నీ నేను చూసుకుంటాను. మీరేం వర్రీ అవకండి" అంటూ వెళ్లిపోయాడు డాక్టర్ శశాంక్.

అప్పటి నుంచీ మొదలైంది ఆపరేషన్ పర్వం ఆ ఇంట్లో.

"అనిల్, ఒరేయ్ అనిల్! మందులేం తెస్తావో నాకు తెలీదుగానీ ముందొక మంచి ఫ్లాస్క్‌తే. ఈ వెధవ ఫ్లాస్కు ఇప్పుడే చెడిపోయిచచ్చింది. అందులో కాఫీ పోస్తే పట్టుమని అరగంట వేడిగా వుండడంలేదు. నీవు పుట్టినప్పుడు మీ అమ్మమ్మ కొన్న ఫ్లాస్కది. మన ప్లాస్టిక్కు బుట్ట అదేరా నీవు మీ అక్క స్కూలుకు లంచ్ పట్టుకెళ్తారని నేను సుల్తాను బజారు నుంచి ప్లాస్టిక్కు దారం తెప్పించి అల్లలేదూ అదే. ఈ మధ్యలో వెధవ ఎలక ఓ మూల కొట్టేసింది. దాన్ని మన వెంకటేషు షాపులో రిపేరుకివ్వు. వాడయితే తొందరగా చేసిస్తాడు. అమీర్‌పేట కనకదుర్గమ్మ గుడి పక్క సందుకు మార్చాడు షాపు. పిచ్చివెధవ, చిన్నప్పుడు మా వూరి నుంచి పారిపోయొస్తే మీ నాన్నేగా వాడికాపని ఇప్పించింది. ఇప్పుడు తానే ఓ షాపు ఓనరైపోయాడు. అంతా కనకదుర్గమ్మ చలవ. ఆ తల్లి చల్లని నీడలో వాడింతవాడయ్యాడు. మరిచిపోకారేయ్. రేపు ఆస్పత్రికి ఆ బుట్ట తీసుకుపోవాలి"

"అదెందుకమ్మా ఇక్ష్వాకులనాటిది. ఇంట్లో ఎన్నో సంచులున్నాయి. ఏదో ఒకటి తీసుకుపోదాంలే. అయినా ఆ వర్రీలన్నీ నీకెందుకు నీ కోడలు చూసుకుంటుందిలే"

"అది మాత్రం ఎన్నని చూసుకుంటుందిరా. ఏదో మనకు తోచిన సహాయం మనం చేస్తే, పైగా అది నేనల్లిన బుట్ట. నీవు నీ చెల్లెళ్లు దాన్ని స్కూలుకు తీసుకెళ్లారు గుర్తులేదా? మీ చెల్లెళ్ల పురుళ్లకూ ఆ బుట్టే పట్టుకెళ్లాను ఆస్పత్రికి. అచ్చొచ్చి బుట్టరా అది. నీ చేతగాదంటే చెప్పు మీ నాన్న రిపేరు చేయించుకొస్తారు"

"సరేలేమ్మా, మన వీధి మొదట్లోనే గొడుగుల రిపేరు షాపుంది. అక్కడే చేయించేస్తాను"

"ఏడ్చినట్టే వుంది, వెంకటేషయితే ఎర్రని ఏగానీ పుచ్చుకోకుండా శ్రద్ధగా చేసిస్తాడు. ఎవడో ఈ అప్రాచ్యపు వెధవ. వీడికేం తెలుసు"

"నీతో వాదించి నే జయించలేను గానీ అలాగే చేయిస్తాలే"

ఇలా గోరంత విషయం కొండంతై శాంతమ్మగారి చిన్న ఆపరేషన్- ఆపరేషన్ బ్లూస్టారంత పెద్దదైపోయింది.

నర్సిచ్చిన లిస్టులో మొదటి ఐటమ్ ఫ్లాస్కు. అక్కడే ఇంత హడావిడి. రెండవది టూత్‌పేస్ట్, బ్రష్. ఏం ప్రాబ్లెమ్ లేని ఐటమ్స్ అనుకుంటుండగానే,

"చూడమ్మా, అనూరాధా! నేను మొన్నే కొత్త టూత్‌పేస్టు ఓపెన్ చేసాను అది కాస్తా ఆస్పత్రికి తీసుకుపోతే వెనక్కు వస్తుందని నమ్మకంలేదు. అసలు నేనే ప్రాణాలతో వస్తానో లేదో, అందుకే ఇంట్లో ఏదైనా బాగా వాడేసిన పేస్టుంటే పాక్ చెయ్యి. రెండు రోజులకు సరిపడా వుంటే చాలు"

'నాన్ కాంట్రవర్షియల్ అనుకున్న టూత్‌పేస్టుకే అమ్మ కాంట్రవర్సీ లేవదీసిందంటే ఇక ఈ లిస్టు పూర్తయ్యేసరికి మన పని గోవిందా' అనుకున్నారు అనిల్, అనూరాధ.

నెక్స్‌ట్ ఐటమ్ టవల్.

"ఒరేయ్, ఆ గొంగళి టవళ్లు పెట్టద్దు. మా పెళ్లినాటిది మీ నాన్నగారి పైపంచ నా పెట్లో వుంది. అదైతే మెత్తగా హాయిగా వుంటుంది. అది పాక్ చేయి"

"ఉంటుంది మెత్తగా, ఎందుకుండదు? యాభై ఏళ్ల నాటి పంచ. దాన్నిండా పసుపు మరకలేకదా! అన్ని పండగల్లో వ్రతాల్లో అద గదా మీ తుండుగుడ్డ"

"పసుపేగా అంటింది, మీ క్రీములకన్నా ఆ పసుపెంతో నయం. మేలు చేస్తుందిగానీ కీడు చేయదు"

నెక్స్‌ట్ ఐటమ్ నైట్ డ్రస్సు.

"ఎందుకుటా ఆ గౌనులు, ఇన్నేళ్లు చీరతో హాయిగా పడుకోలేదూ"

"పొట్టపైన ఆపరేషన్ కదత్తయ్యా, లంగా కట్టుకోవడం కష్టమవుతుందని చెప్పుంటారు"

"సరే, ఏదో అఘోరిద్దాంలే. శుక్రవారం పదకొం


డింటికల్లా ఆస్పత్రిలో వుండమన్నాడు కదా. పదిన్నర నుంచీ రాహుకాలం. తొమ్మిదింటికల్లా ఆ బుట్ట పట్టు కెళ్లి పక్కింటి పద్మావతమ్మ గారింట్లో పెట్టు"

సాయంత్రం శాంతమ్మగారూ, భర్త జగన్నాథం గారూ అలా బయటికెళ్తుంటే "అయ్యో నడిచెందుకెళ్తా రత్తయ్యా, ఏవైనా కావాలంటే మీ అబ్బాయి రాగానే తీసుకెళ్తారు కదా"

"గుండి వరకే లేమ్మా, ఇప్పుడే వచ్చేస్తాం" అంటూ బయలుదేరారు ఇద్దరు.

"ఇదుగో శాంతా, ముందు దైవదర్శనం చేసుకుని ఆపైన షాపుకెళ్లి రెండు నైటీలు కొందాము. పాపం నీవెప్పుడూ ముచ్చటపడేదానివి. నేనే పడనీయలేదిన్ని రోజులు. ఈ రూపంలో నీ కోరిక తీరబోతోంది"

"ఇప్పుడివన్నీ ఎందుకులెండి, అసలే ఆపరేషన్ బోలెడు ఖర్చు. కోడలివే రెండు పాత గౌన్లు తీసుకుంటే సరిపోతుంది" అంది. కానీ మనసులో ఈయన నా ఇష్టాన్ని ఎంత బాగా గుర్తుపెట్టుకున్నారో అని మురిసిపోయింది.



"నీ కొడుకు లక్షలు సంపాదిస్తున్నాడే, నీవేం దిగులు పడకు. అయినా నేనింకా బతికే వున్నాను. నాకూ ఫించను వస్తుంది. నీకు రెండు నైటీలు కొనియ్యగలనులే. నీకు నచ్చినవి తీసుకో"

"అయ్యోరామా! అవేం మాటలండీ, అలాగే కొందాంగానీ మీరట్లా మాట్లాడకండి"

పింకు నైటీపైన ఎంతో మనసు పోయినా మాపుకాగదు, ముదురు రంగే కొందామనుకుంది. కానీ జగన్నాథంగారు మాత్రం నీవు మనసుపడిందే తీసుకొమ్మంటూ రెండూ కొనేశారు.

"చూడు శాంతా ఆపరేషన్ తర్వాత ఎంత చాతనవుతుందో ఏమో, ఒకసారలా పార్లరుకెళ్లి తలకు రంగు వేయించేసుకో"

"ఎందుకూ నేనే వేసుకుంటాను. పార్లరువాళ్లు వందలొందలు తీసుకుంటారట, ఇంతోటి రంగు వెయ్యడానికి. మళ్లీ నాకు నెమ్మదించిన తర్వాత వేసుకుంటే పోతుంది"


"ఎందుకలా హైరానాపడిపోతావు. ఆపరేషనంటే నాకే ఎంతో గాభరాగా వుంది. నీ సంగతి నాకు తెలీదా, వద్దు. ఇప్పుడా పనులేవీ పెట్టుకోకు. పద పార్లరుకెళ్దాం"

"మీరన్నీ ఆలోచించే బయలుదేరారు. నే చెప్తేమాత్రం వింటారా, పదండి పోదాం"

పార్లరు నుంచి రాగానే "పద తాజ్ హోటల్లో ఇడ్లీ తిని పోదాం. నీకెంతో ఇష్టం కదా" అన్నారు.

"ఏమిటీ నా ఆపరేషన్ అంత సీరియస్సా, మళ్లీ నేను బతికి బయటపడనంటారా? ఎందుకింత హడావిడి చేస్తున్నారు?"

"పిచ్చిదానా, అట్లా అర్థం చేసుకుంటున్నావా నీవు, అదేం లేదు మనిద్దరమే కలిసి బయటికొచ్చి ఎన్ని నెలలయింది చెప్పు. ఏదో నీతో కలిసి సరదాగా గడపాలని







పించింది అంతే. ఇంట్లో ఎప్పుడూ నీ చుట్టు మనవలుంటారు, లేదా కిచన్లో బిజీగా వుంటావు. నీతో మాట్లాడే టైమే వుండదు. ఇంక కలిసి తినే టైమెక్కడ? పద.."

భర్త అనురాగానికి మురిసిపోయి మురిపెంగా చూసిందాయన వైపు.

ఇంటికి చేరగానే ఎదురైన కోడలిని చూసి "కనక దుర్గ గుడికెళ్లాము. ఆ సందులోనే షాపు కనబడితేనూ ఎలాగూ కావాలన్నారు కదా అని ఓ రెండు గౌన్లు కొన్నారు మీ మామగారు" అంటూ వడివడిగా ఇంట్లోకెళ్లిపోయింది.

పెళ్లికెళ్లడానికన్నట్టు తయారైన అత్తగారిని చూసి నవ్వుకుంది అనూరాధ.

మంచి కెంపు కలరు కంచి కాటను చీర మాచింగు బ్లవుజు, ఐదు రూపాయల బిళ్లంత బొట్టు, కొత్తగా రంగు వేయించుకున్న జుట్టు, ఒత్తుగా మెత్తుకున్న పౌడరు వల్ల తెల్లని మొహంతో వున్న నాన్నమ్మను చూసి "సుపర్బ్ నానమ్మా! నువ్వు సుపర్బ్. కానీ నీ పక్కన ఆ బుట్టే వేస్ట్, మోస్ట్ అన్‌సూటబులో" అంది.

"పోవే నీకేం తెలుసు ఆ బుట్ట సంగతి, ఎంత అచ్చొచ్చిందో"

"అమ్మో నీ బుట్టకథ చాలించి కారెక్కు, మళ్లీ రాహుకాలమో వర్జ్యమో మరేదో అంటూ గోల పెట్టేస్తావ్"

హాస్పిటల్లో కారు దిగగానే ఎదురొచ్చిన నర్సుని చూసి శుభశకునం అంటూ కుడికాలు లోపల పెట్టారు శాంతమ్మగారు.

"ఆపరేషన్ సక్సెస్" అన్నాడు డాక్టర్ శశాంక్.

మత్తులోంచి అప్పుడే తేరుకుంటున్న శాంతమ్మ తన కడుపు లోంచి తీసిన ఆ గంగరేగు పండు సైజు గులక రాయిని పురిటి నొప్పుల తర్వాత బిడ్డను చూసుకున్నంత ఆనందంగా చూసుకుంటూ "అబ్బ, ఈ బుజ్జిముండనా ఇంత నొప్పి చేసింది" అంటూ ఆశ్చర్యపోయారు.

"నర్స్ దాన్ని పారేయ్" అన్న డాక్టరు శశాంక్‌తో "వద్దురా వద్దు. దాన్ని నాతోటే ఇంటికి తీసుకెళ్తాను. మన పక్కింటి మాలక్ష్మమ్మకు చూపించాలి. తనెంత బడాయిగా చెప్పుకుందో తన కాల్లో ఇనుపముక్క వేసి కుట్టేశారని. ఇప్పుడింత పెద్దరాయిని చూస్తే కళ్లు తేలేస్తుంది. దీన్ని తీసుకెళ్లాల్సిందే" అంటూ ఎంతో పదిలంగా మంచి గాజు సీసాలో భద్రపరిచి ఇంటికి తీసుకెళ్లారు ఆ రాయిని.

ఆపరేషన్ అయిన అమ్మను చూసిపోదామని ఢిల్లీ నుంచి వచ్చింది శాంతమ్మగారమ్మాయి భర్తతో సహా. "మామయ్యా, మామయ్యా మా షోకేసులో ఓ కొత్త క్యూరియో పెట్టాము రా చూడు" అంటూ ఆ గాజు గ్లాసు చూపించింది శిరీష.

"ఎవరితో ఏం మాట్లాడాలో తెలీదే నీకు శిరీషా" అంటూ కొంగు భుజం చుట్టూ కప్పుకుంటూ సిగ్గుపడి పోయింది శాంతమ్మ.

నానమ్మా..ఈజ్ బ్లషింగ్ అంటూ "అత్తా! నువ్వు, నాన్న పుట్టినప్పుడైనా ఇంత అపురూపంగా చూసుకుందో లేదోగానీ ఈ బండరాయిని మాత్రం భలే అపురూపంగా చూసుకుంటోంది నాన్నమ్మ. మొత్తానికి ఆపరేషన్ బ్లాసార్ట్‌లాగా, ఆపరేషన్ రాక్‌స్టార్ కూడా సూపర్ సక్సెస్" అనగానే అందరూ నవ్వేశారు.

అర్థంకాకపోయినా మనవరాలి వైపు మురిపెంగా చూస్తూ వాళ్ల నవ్వుల్లో భాగం పంచుకుంది శాంతమ్మ.



## రెడీ...రెడీ...

ఓ వైపు వయసు పైబడుతూ 'కుర్ర' వేషాలు తగ్గుతున్నందుకేమో స్నేహ కూడా బికినీ వేయడానికి రెడీయేనంటోంది. అయితే కథకు అవసరమైతేనే, తప్పదూ అనుకుంటేనే సుమండీ అనే ఓ చిన్నపాటి కండిషన్ కూడా పెడుతోందని చెన్నయ్ సినీవర్గాల సమాచారం. ఏదయితేనేం కాస్త వార్తల్లోకి వచ్చి నలుగురి దృష్టిలోకీ మళ్లీ మళ్లీ రావడానికి, నాలుగు సినిమాలు చేతికి చిక్కేందుకు చేస్తున్న పబ్లిసిటీ ప్రోగ్రామే ఇది అని తేల్చిపారేస్తున్నారు సినీజనాలు.